క్లుప్తంగా

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రైవేట్ రంగంలో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో వందల సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటవుతున్నా ఉద్యోగాల కల్పనలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


కార్మికులకు సామగ్రిని అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్: పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్ సబ్బులు, నూనె తదితర సామగ్రిని పంపిణీ చేశారు. పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులు మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతకు కృషి చేయడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వారు సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వృథాగా ఉన్న పాత ఎస్‌పీపీ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి పట్టణ శివారులోని సంపులోకి నీరు చేరేలా అవసరమైన చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, సవిత హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌కు ఉగాది నంది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న భాస్కర్

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన మాదారం భాస్కర్ అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను వేముల వాడలోని లంబోదర కల్చరల్‌అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కారాన్ని అందించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో లంబోదర కల్చరల్ అకాడమీ నిర్వాహకులు ఈ పురస్కారాన్ని భాస్కర్‌కు అందించారు. భాస్కర్ మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను గుర్తించి ఉగాది పురస్కారాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు.

వ్యక్తి అదృశ్యం


రాములు

సంగారెడ్డి : చౌటకూర్ మండలం ఛెక్రియాల్ గ్రామానికి చెందిన మద్దికుంట రాములు (58) మార్చి 30వ తేదీ నుంచి కనబడుట లేదని ఆయన కుమారుడు యాదగిరి ఆదివారం పుల్కల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలు తెలిస్తే 8712656754 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: లంబాడీల స్మశాన వాటికలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన గోపాల్ గ్రామానికి తాగునీటిని వదిలి అటుగా వెళ్తుండగా స్మశానవాటికలో సుమారు 60 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. వారు మృతుడు భిక్షగాడిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బొంతపల్లి శివారులో..


గుర్తు తెలియని మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి శివారులో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు యాచకునిగా ఉన్నాడని, ఇతని వయస్సు 50 ఏళ్ల వరకు ఉంటుందని ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు. పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎంపీపీ కాంగ్రెస్ వశమేనా?

- ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ
- రసవత్తరంగా జిన్నారం రాజకీయాలు


జిన్నారంలోని ఎంపీపీ కార్యాలయం

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీపై ఇటీవల బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఎంపీపీ ఎన్నికకు ఒకే ఎంపీటీసీ కీలకం కావటంతో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరటంలో మండల రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

మండలంలో 8ఎంపీటీసీ స్థానాలు ఉండగా 4 బీఆర్‌ఎస్, 4 కాంగ్రెస్ ఎంపీటీసీలు ఉన్నారు. టాస్ ద్వారా నాలుగేళ్ల క్రితం ఎంపీపీని ఎన్నిక చేశారు. ఎంపీపీగా రవీందర్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇద్దరు కాంగ్రెస్ ఎంపీటీసీలు బీఆర్‌ఎస్‌లో చేరగా. మరో బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యురాలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ ఎంపీటీసీల సంఖ్య ఐదుకు పెరిగింది. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్ కోర్టును ఆశ్రయించటంతో నెలరోజుల పాటు కోర్టు స్టే ఇచ్చింది. బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు కూడా కోర్టును ఆశ్రయించటంతో కోర్టు స్టే ఎత్తివేసింది. తాజాగా గత నెల 2న అవిశ్వాస సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు ఎంపీటీసీలకు నోటీసులను అందించారు. ప్రస్తుతం ఉన్న బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యుడు గంగు రమేశ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరారు. ఈ చేరికతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎంపీటీసీల సంఖ్య సమానమైంది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. ఈనెల 2న నిర్వహించనున్న సమావేశంలో ఎంపీపీ పదవి ప్రస్తుతం ఉన్న రవీందర్‌గౌడ్‌నే వరించనుందని రాజకీయ నాయకులు విశ్లేషించుకుంటున్నారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ గంగు రమేశ్ తీరుపై బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహంగా ఉన్నారు. ఈనెల 2న జరిగే సమావేశంలో ఎలాంటి అనూహ్యపరిణామాలు జరుగుతాయో చూడాలి.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

31ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–1993 ఏడాదిలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిన్నారంలోని రైతు వేదికలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి, శర్మ, వయోజుద్దీన్, కృష్ణారెడ్డి, నాగభూషణంను విద్యార్థులు సన్మానించారు. అప్పటి విషయాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


పార్టీలో చేరినవారితో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామం బీఆర్‌ఎస్ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, మాజీ సర్పంచ్ శివరాజ్ ఆదివారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, జానాబాయి పాల్గొన్నారు.

రంజాన్ ఐక్యతకు చిహ్నం

పటాన్‌చెరు టౌన్: రంజాన్ పర్వదినం కుల మతాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతకు చిహ్నమని కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలోని నందిగామ గ్రామంలో మదీనా మసీదులో ఆదివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ శివానందం, గోరేమియా, మత పెద్దలు పాల్గొన్నారు.

నేను మీ బిడ్డనే.. ఆశీర్వదించండి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు


భారతమ్మ ఆశీర్వాదం తీసుకున్న నీలం మధు

పటాన్‌చెరు: అమ్మ నేను మీ బిడ్డనే.. మద్దతు ఇవ్వండి అంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మాతృమూర్తి కాట భారతమ్మకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని వారి ఇంటికి వెళ్లిన అనంతరం మాట్లాడుతూ తాను, కాట శ్రీనివాస్ గౌడ్ రామ లక్ష్మణుల్లా కలిసి ముందుకు సాగుతామన్నారు. మెదక్ ఎంపీగా నీలం మధు విజయం సాధించాలని ఆమె ఆశీర్వదించారు.

ఘనంగా మల్లన్న జాతర..


ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని మందు మూల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా మల్లన్న జాతర నిర్వహించారు. ఈ జాతరలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మల్లన్న జాతర, కల్యాణ మహోత్సవంలో భాగంగా గంపల ఎదుర్కొనే ఊరేగింపు కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్, ముంగి గ్రామ శివారులో వెలసిన శ్రీసిద్ధివినాయక, ఆదిలక్ష్మి ఆశ్రమంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయాలకు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ భక్తులకు ప్రవచనాలు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హరీశ్‌రావును కలిసిన గిరిజన నాయకులు


హరీశ్‌రావును కలిసిన గిరిజన నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ గిరిజన నాయకులు ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిశారు. ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం నాయకులు రఘురాం రాథోడ్, శ్రీనివాస్, వాసునాయక్ తదితరులు డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్‌తో కలిసి మాజీ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను కూడా కలిశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


బోనాలతో తరలివస్తున్న మహిళలు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రంలోమైన కందిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే చింతాప్రభాకర్, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు రమేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకన్న గౌడ్‌తోపాటు పలువురు మండల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యమకారుడికి కోదండరాం పరామర్శ


ప్రశాంత్‌ను కలిసిన కోదండరాం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ఉద్యమకారుడు, విద్యుత్ జేఏసీ నాయకుడు కోహీర్ ప్రశాంత్‌ను తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆదివారం పరామర్శించారు. ప్రశాంత్‌కు ఇటీవల తుంటి కీలుమార్పిడి ఆపరేషన్ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కోదండరాం ప్రశాంత్ ఇంటికి వచ్చారు. ఆయన ఆరోగ్య సమస్యలు తెలుసుకుని త్వరగా కోలుకోవాలన్నారు.

రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలి


గుర్తింపు కార్డులు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ

సదాశివపేట(సంగారెడ్డి): రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రైవేట్ స్కూల్, కళాశాలల బస్సు డ్రైవర్లు, సహాయకులను ఆదుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్ పేర్కొన్నారు, ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల బస్సు డ్రైవర్ల యూనియన్ సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో భవిత జూనియర్ కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించి డ్రైవర్లకు యూనియన్ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తాన్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది రవాణా రంగంలో డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, వారి సంక్షేమం గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శివరాజ్‌పాటిల్, నాయకులు సత్యనారాయణ, అంజి, పట్టణ స్కూల్, కళాశాల డ్రైవర్స్ యునియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి నర్సింలుగౌడ్, ఉపాధ్యక్షుడు మైబల్లి, కోశాధికారి జగన్మోహన్‌చారి, శ్రీనివాస్, సదాశివుడు, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. వివిధ గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్


రాక్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలలో పాల్గొన్న క్రైస్తవులు


న్యాల్‌కల్(జహీరాబాద్): రెజింతల్ గ్రామ శివారులో గల బెతెస్తా చర్చిలో రక్తదానం చేస్తున్న యువకులు


జహీరాబాద్ టౌన్: బూచినెల్లి గ్రామ ఈస్టర్ గుట్ట వద్ద..


ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

సంక్షిప్త వార్తలు

◆ **పెండింగ్ వేతనాలు చెల్లించాలి**

నారాయణఖేడ్: గ్రామ పంచాయతీ కార్మికులకు సంబంధించిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నారాయణఖేడ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలతో పాటు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు.

◆ **నేడు ఖేడ్‌లో బీజేపీ సమావేశం**

నారాయణఖేడ్: బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు నారాయణఖేడ్‌లోని జీవన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొట్టాలే రజనీకాంత్ తెలిపారు. జహీరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ప్రభారి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్ గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

◆ **ఆర్థిక సాయం**

కంగ్టి(నారాయణఖేడ్): పేదింటి పెళ్లి కూతురికి పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని తడ్కల్ గ్రామానికి చెందిన చాకలి నాగమణి తల్లి ఎల్లవ్వ మృతి చెందింది. నాగమణి పెళ్లికి గురించి స్థానికులు రుస్తుం జలీల్ ట్రస్ట్ చైర్మన్‌కు తెలుపగా వెంటనే స్పందించి రూ. 5 వేలు ఆన్‌లైన్‌లో వేయగా ఆదివారం అందజేశారు.

◆ **ట్రాఫిక్ రూల్స్ పాటించాలి**

సంగారెడ్డి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పుల్కల్ ఎస్‌ఐ శ్రీకాంత్ సూచించారు. ఆదివారం సాయంత్రం పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాడ్‌దాన్ పల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని 30 మంది వాహనదారులకు, సీట్ బెల్ట్ ధరించని 25మంది కారు డ్రైవర్లకు చలానాలు విధించారు.

◆ **మహీంద్ర కాలనీలో నగర సంకీర్తన**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ మహీంద్ర కాలనీలో ఆదివారం హరే రాధకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నగర సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని నలమూలాల నుంచి తరలి వచ్చిన భక్తులు భజనలు చేస్తూ కీర్తనలు ఆలపిస్తూ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. మహీంద్ర కాలనీ నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన పాదయాత్ర వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగింది. అనంతరం నిర్వాహకులు భక్తులకు అల్పాహారం అందచేశారు. నగర సంకీర్తనలో డాక్టర్లు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఆశీర్వాదం, ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రెజీనాల్డ్‌లకు నియమిక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకొనివెళ్లి వివరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, తూర్పు శ్రీనివాస్, అరుణ్ గౌడ్, హాబీబ్ జానీ, సుధాకర్ రెడ్డి, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మోదీతోనే దేశం సురక్షితం**


సోలక్‌పల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మోదీతోనే దేశం సురక్షితంగా ఉంటుందని, దేశంలో మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆపార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని అండూర్, సోలక్‌పల్లి గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆదివారం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. జగన్‌రెడ్డి మాట్లాడుతూ మోదీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఇష్టానుసారంగా పన్ను వసూలు**

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారంగా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని బహుజన సేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డప్పు రాజు ఆరోపించారు. ఆదివారం అనంతసాగర్‌లో ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు పెంచి పేదలను దోచుకోవడం సరికాదని, గత ప్రభుత్వం మాదిరిగానే పన్నులు వసూలు చేయాలని కోరారు. పంచాయతీ అధికారులు 2024 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ నిర్వహణ పేరుతో అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు గౌస్, శంకరమ్మ, బిపాషా, సలీమ తదితరులు పాల్గొన్నారు.

◆ **13న మెగా రక్తదాన శిబిరం**

నారాయణఖేడ్: మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జయంతిలను పురస్కరించుకుని ఈనెల 13న ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సామాజిక ఉద్యమకారుడు కొటారి నర్సింహులు, ఖేడ్ బ్లడ్ డోనర్స్ గ్రూపు వ్యవస్థాపకులు ముజాహెద్ చిష్తీ, ఓంప్రకాష్, రాజు తెలిపారు.

మెదక్‌లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

ఎమ్మెల్యే చింతాప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతాప్రభాకర్

కంది(సంగారెడ్డి): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన కందిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నందున ఎంపీ స్థానాన్ని సులువుగా కైవసం చేసుకోవచ్చని తెలిపారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. ఎల్లప్పుడూ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ సరళా పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణగౌడ్ పాల్గొన్నారు.